క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



ఓటరుకు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయప్రసాద్

దొర్నిపాడు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 34, 35, 46, పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జయప్రసాద్ ఆదివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, విద్యుత్, సీలింగ్, ఫ్లోరింగ్ ఎలా ఉన్నాయని బీఎల్ఓలతో కలిసి పరిశీలించారు. అనంతరం 15మంది యువకుల నుంచి నూతన ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు మాలతి, లక్ష్మిదేవి వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన



చాగలమర్రిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు

చాగలమర్రి: ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన లభించిందని అధికారులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 52 పోలింగు కేంద్రాలకు సంబంధించి 2వ రోజు చేపట్టిన నూతన ఓటర్ల నమోదు, పేర్లు, అడ్రసులు మార్పులు, చేర్పులు, ఓట్ల తొలగింపులకు సంబంధించి 270 దరఖాస్తులు అందాయని డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో 19 బూత్‌లు, గ్రామాల్లో 33 బూత్‌ల నుంచి వచ్చిన దరఖాస్తులను బీఎల్ఓలు మొబైల్ యాప్‌లో నమోదు చేశారని చెప్పారు. 1వ సచివాలయ బీఎల్ఓలు వెంకటేశ్, దినేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. కార్తీక మాసం కావడంతో అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు



మిఠాయిలు పంచుతున్న నాయకులు

నంద్యాల(అర్బన్): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకం ఎగురవేయడంపై స్థానిక నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయ ఆవరణలో మిఠాయిలు పంచారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పదేళ్ల తర్వాత ప్రజలు ఆదరించడం హర్షనీయమన్నారు. తెలంగాణలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఊకొట్టువాసు, ఎస్‌వైడీ ప్రసాద్, రియాజ్, సలాం, శివరామిరెడ్డి, హుసేని, సికిందర్‌బట్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రాజస్థాన్, మధ్యప్రదేశ్ చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ కేతనం ఎగురవేయడంతో ఆ పార్టీ నంద్యాల అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్య ఆచారి ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా రమేష్, విజయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన



సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్తసంపద కేంద్రంలో తయారు చేసే సేంద్రియ ఎరువులను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని సూచించారు. కేంద్రంలో వానపాముల ద్వారా తయారైన సేంద్రియ ఎరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా గ్రామాల్లో కూడా చెత్తసంపద కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.



వడ్లు ఆరబోస్తున్న ఈమె పేరు చామంతి. సుద్దమల్ల గ్రామానికి చెందిన కౌలు రైతు. సొంత పొలం లేకపోవడంతో ఏటా కుందూ నది తీరంలో కొంత పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తుంది. ఈ ఏడాది కూడా పంట సాగు చేసింది. 'ఈ ఏడాది రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట వేయగా.. 42 సంచులు (75కేజీలు) దిగుబడి లభించింది. ధర కూడా బాగుంది. గతంలో మాలాంటి కౌలు రైతులను పట్టించుకోకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులుండేవి. ప్రస్తుతం జగనన్న వచ్చాక మాకు కూడా రైతుభరోసా అందజేస్తున్నారు. ఈ విడతలో నాకు రూ.13,500 సాయం లభించింది.ఈ మొత్తం పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడింది. ఇలా కొంత సహకారం అందిస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతాం.



ఈయన పేరు తిరుపాల్ రెడ్డి, మాయలూరు గ్రామ రైతు. 'నాకున్న 6 ఎకరాలతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని కర్నూలు సోనా రకం వరి పంట సాగు చేశా. ఎకరాకు 49 బస్తాల ప్రకారం దిగుబడులు వచ్చాయి. 77 కేజీల బస్తా రూ. 2200కు విక్రయించా. ఎకరాకు పెట్టుబడుల రూపంలో రూ. 25 వేలు ఖర్చు వచ్చింది. నా అనుభవంలో ఇటువంటి ధర, దిగుబడులు చూడ లేదు. ప్రభుత్వం ముందస్తుగా మద్దతు ధర ప్రకటించి మాకు మేలు చేసింది. అలాగే పెట్టుబడి సాయం ఇస్తుండటంతో ఖర్చులు కొంత మేర తగ్గాయి.

అన్నదాత ఖుషీ..

- కలిసొచ్చిన వరి సాగు
- ఎకరాకు 42 బస్తాల దిగుబడులు
- ఊరిస్తున్న గిట్టుబాటు ధర
- రైతన్నల్లో హర్షాతిరేకాలు
- ప్రారంభమైన ఖరీఫ్ కోతలు



మాయలూరు సమీపంలో యంత్రాలతో వరి పంట కోత కోస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : ఈ ఏడాది వరి సాగు రైతులకు అన్ని విధాలా కలిసి వచ్చింది. ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవడంతో పాటు అనుకూల వాతావరణంతో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. కుందూ నదికి నీటి సరఫరా కొనసాగుతుండటంతో మండలంలో 14 గ్రామాల్లో నదీతీరం వెంట 822 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. పంటకు కావాల్సిన సాగు నీరు పుష్కలంగా అందడంతో పాటు చీడ పీడలు తక్కువగా ఉండటంతో పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం సుద్దమల్ల,మాయలూరు, రూపనగుడి, అల్లూరు, హరివరం గ్రామాల్లో పంటకోతలు ప్రారంభమయ్యాయి.

ఎకరాకు 42 బస్తాల దిగుబడి..

గత ఏడాది ఖరీఫ్‌లో వరి దిగుబడులు కాస్త తగ్గగా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచిరూ. 28 వేల వరకు వెచ్చించారు. వాతావరణం అనుకూలంగా మారడంతో ఎకరాకు 40 నుంచి 42 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి.



సుద్దమల్లలో వరి దిగుబడులను ఆరబోసిన రైతులు

ఊరిస్తున్న గిట్టుబాటు ధర..

ఈ ఏడాది వరి సాగుకు ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. క్వింటా రూ. 2,060గా నిర్ణయించింది. వరికి మద్దతు ధర వుండడంతో నూర్పిడి చేసిన వెంటనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు మార్కెట్ ధర కన్నా అధికంగా 77 కేజీల బస్తాకు రూ. 2,200 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరుతుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈరోజు

స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ పరిష్కారం కాకపోతే ఇక్కడ వినతి పత్రాలు అందజేయాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీలపై గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ రవిప్రకాష్ ఆదివారం తెలిపారు. ఈనెల 4వ తేదీన నర్సిపల్లె, కొండుపల్లె, 5న రూపనగుడి, మాయలూరు, తుడుమలదిన్నె, సుద్దమల్ల, పడిగెపాడు, సర్వాయిపల్లె, బోడెమ్మనూరు, పుచ్చకాయలపల్లె, 7న కాకరవాడ, 8న గోవిందపల్లె, 9న పెద్దయమ్మనూరు, 10న అల్లూరు,ఎస్.కొత్తపల్లె, ఆర్.పాంపల్లె, ఆర్.జంబులదిన్నె, ఇంజేడు, ఉయ్యాలవాడ, హరివరం గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

శిరివెళ్ల: ఈ నెల 4వ తేదీన మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని సూచించారు.

గడప గడప పనులు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రుద్రవరం: గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాల్లో పనులకు ప్రతిపాదనలు,తీర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. మండలంలో మొత్తం 16 గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటికే 8 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. ఆయా గ్రామాల్లో పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. మిగిలిన 8 గ్రామ సచివాలయాల పరిధిలో నిన్నటితో కార్యక్రమాన్ని ముగించారు. ఆ సచివాలయాలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆదివారం మండలంలోని ఎర్రగుడిదిన్నెలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..త్వరతి గతిన ప్రతిపాదనలు,తీర్మాణాలు వంటి ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులను చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, తహీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు వస్త్రాలను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ ఐఎంఏ మహిళా విభాగం లయన్స్‌క్లబ్ సంయుక్త సహకారంతో ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బాలాజీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షత జరిగిన క్యాక్రమం నిర్వహించారు. మెప్మా అధికారి భాస్కరరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథంలో కొనసాగాలని, మెప్మా తరఫున సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం 500 మంది దివ్యాంగులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ దస్తగిరిరెడ్డి ఐఎంఏ వైద్యులు వసుధ, కల్పన, అరుణకుమారి, శైలజా, నాగమణి, నర్మద, కొట్టి కృష్ణమూర్తి, రమణయ్య, సుబ్బారెడ్డి, డాక్టర్ సహదేవుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

దొర్నిపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు అర్హులైనా.. దూరంగా నిలిచి పోయిన వారిని లబ్ధిదారులుగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుండుపాపల గ్రామంలో వికసిత్ భారత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం గురించి వివరించారు. అలాగే పొదుపు రుణాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీ ఆర్డీ శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, ఏఓ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీత, వెలుగు ఏపీఎం బాబు, ఎంఈఓ అబ్దుల్ కరీం, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, వీఆర్ఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా విళక్కి పూజ



చాగలమర్రిలో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రంలో వెలసిన శ్రీఅయ్యప్పస్వామి వారికి ఆదివారం విళక్కి పూజ సందర్భంగా గ్రామంలో దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. ఉదయం మాలధారులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, బలిహరణ, గణపతి హోమం, చందనాలంకారం, మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, 108 కళశములతో అభిషేకం తదితర కార్యక్రమాలను అర్చకులు సత్తేనపల్లె వాస్తవ్యులు దీక్షితులు వర్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిపించారు. అనంతరం దీక్షధారులకు బిక్ష అందజేశారు. రాత్రి పదునెట్టాంబడి పడి పూజ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీఅయ్యప్పాస్వామి సేవా సమాజం, ఆర్యవైశ్యసభ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ గ్రామ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నామని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక వ్యవస్థాపక బాధ్యులు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మీ ఆరోగ్యం-మీ చేతుల్లోనే అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులు వైద్యులను సంప్రదించకుండా తమ రోగాలను తామే నయం చేసుకునేలా వారిలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో పూర్తి స్థాయి ఆరోగ్య సూత్రాలకు సంబంధించి సమగ్రమైన శిక్షణా తరగతులను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని చెప్పారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకుమల్ల రహీం, కోశాధికారి సత్యనారాయణ, ప్రసన్నకుమారి, శివరామిరెడ్డి, శివశంకర్, దస్తగిరి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల జీవో విడుదల చేయాలని, కేజీబీవీ టీచర్లకు టైమ్ స్కేల్ అమలు చేయాలని, ప్రత్యేక హాస్టల్ వార్డెన్‌ను ఏర్పాటు చేయాలని, ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, నిలిచి పోయిన పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల ఆర్థికపరమైన పీఎఫ్ లోన్లు, సంపాదిత సెలవులు మొత్తం మంజూరు చేయాలన్నారు. అలాగే మధ్యంతర భృతి 20శాతం ప్రకటించి ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. కృష్ణారావు, విజయరావు, సుమయాన్, కలీముల్లా, మౌలిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె నియోజకవర్గ ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నంద్యాల పట్టణంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల ఉపాధ్యక్షుడిగా హరినాథగౌడ్, పరిశీలకుడిగా రామచంద్రారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా బనగానపల్లె మండల అధ్యక్షుడిగా రామసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, వీరయ్య ఆచారి లలితమ్మను ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శులుగా కుమార్‌బాబు, భాస్కరరావు, నాగసురేఖ ఎన్నికయ్యారు. సభ్యులుగా శ్రీరాములు, ఓబయ్య, హరినాథగౌడ్ ఎన్నికయ్యారని శివయ్య వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మహానంది: తిమ్మాపురంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సుంకులా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభంగా నిర్వహించారు. ఈ మేరకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, పరిహారణం, పూర్ణాహుతి పూజలు వైభంగా జరిగాయి. కాలనీ వాసుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం షష్ఠి సందర్భంగా ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

మహానంది: ఐకమత్యంతో ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలుగుతామని కుమ్మరి శాలివాహన సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మద్దయ్య తెలిపారు. మహానందిలోని శ్రీ మహానందీశ్వర కుమ్మరి శాలివాహన అన్నదాన సత్రం ఆవరణలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన సంఘం సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీశైలం అన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు అనంత రమణ, నాగేశ్వరరావు, మహానంది అన్నదాన సత్రం అధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి గురునాథ్, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులు తమ్మడపల్లె శివయ్య, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం చేరుకున్న మంత్రి అప్పలరాజు



మంత్రికి ఆహ్వానం పలుకున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనార్థమై ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి డా.అప్పలరాజు శ్రీశైలం విచ్చేశారు. వీరికి భ్రమరాంబా అతిథిగృహం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం మంత్రి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని అధికార వర్గాలు తెలిపారు.

సగర సంఘీయుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): సగర(ఉప్పర) సంఘీయుల సమస్యలు పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. సగర సంఘీయుల సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రథమనంది దేవస్థానంలో ఆదివారం సగర సంఘీయులు నిర్వహించిన కార్తీక వన భోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారితో కలిసి భోజనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఇలా కుటుంబ సభ్యులంతా కలిసి సంతోషంగా వనభోజనోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న జయంతి వెంకటేశ్వర్లు

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్యులు ఐక్యతతో సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ శివారులోని మూలమఠంలో శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల కార్తీక వన భోజనాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మహిళలు ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజకీయంగా ఆర్యవైశ్యులు అడుగులు వేయాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్, బింగుమల్ల శ్యాంసుందర్ గుప్త, సుబ్బలక్ష్మయ్య, చంద్రశేఖర్, కంభం శీను, అడ్డగాళ్ల మల్లికార్జున, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దివ్య, ఇందుమతి పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారంపై సమ్మేళనం





మాట్లాడుతున్న శారదాపీఠం పీఠాధిపతి శ్రీశివయోగేంద్ర సరస్వతి, ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారం పై ఆదివారం ఉదయం 10 గంటలకు శివరామానందస్వామి ఆశ్రమం నుండి నగర సంకీర్తన కన్యకాపరమేశ్వరీదేవి కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమ్మేళన కార్యక్రమంలో కాకనూరు శ్రీ శారదాపీఠం పీఠాధిపతి శ్రీశివయోగేంద్ర సరస్వతి (కొలను భారతీ ఉపాసకులు) హాజరై.. మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించటం మన కర్తవ్యమన్నారు. రిటైర్డు జడ్జి కాశీభట్ల శివప్రసాద్, ఆర్‌ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్, భైరవ గుండాల దేవస్థాన పర్యవేక్షకులు మునయ్యస్వామి,ఎస్ఎస్ఎఫ్ జిల్లా సహకన్వీనర్‌లు పత్తి నాగమోహన్‌రెడ్డి, సల్లా నాగరాజు, జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్ వై బి తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ వి.భాస్కర్ రెడ్డి, సహ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

వేగంగా వాటర్ ట్యాంక్ పనులు



ట్యాంకు పనులు జరుగుతున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.88లక్షలతో నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో 90వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి గ్రామస్తుల నీటి ఇబ్బందులను గుర్తించి ట్యాంకు నిర్మాణంతో పాటు మజరా గ్రామం బాపూజీనగర్‌కు పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ డోలావతమ్మ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పనులు త్వరగా పూర్తి చేసి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సర్పంచ్ డోలావతమ్మ తెలిపారు.

మహానందిలో సండే సందడి



క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

మహానంది: కార్తీక మాసం, ఆదివారం సెలవు సందర్భంగా మహానంది భక్తులతో సందడిగా కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, నంది స్థూపం, నాగులకట్ట ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో అదనపు ప్రసాదం కౌంటర్‌ను ఏర్పాటు చేయించారు. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో కర్ణాటక ఐజీ అశ్విన్ కుమార్ శర్మ, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన వారికి ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.